
■ మంజుశ్రీ
■ చిత్రాలు: చంద్ర



స్వదేశో భువనత్రయం' అని కదా పెద్దలంటారు. ఈ వయసున ఇక్కడే పడి ఉండక అంత దూరం రావడం నాకిష్టం లేదు" అన్నాడు రఘునాథరావు.

"ఆ మొదటిమాట నాకర్థమైంది కానీ, రెండోదే అర్థం కాలేదు" అన్నాడు సాంబమూర్తి.

"ఏ మాట" అని మళ్ళీ అడిగాడు తండ్రి.

"అదేదో భువనత్రయం అన్నావు కదా" అన్నాడు కొడుకు.

"అవునులే! నీవు కంప్యూటర్ డాక్టరువి. సెంట్రల్ స్కూల్ ప్రోడక్ట్‌వి. చిన్నతనంలో ఒక తెలుగు పద్యం కానీ, చిన్న సంస్కృత శ్లోకం కానీ నేర్చుకుంటే కదా. ఇప్పుడేం తెలుస్తాయి" అన్నాడు రావుగారు.

"పోనీలే నాన్నా ఇప్పుడవన్నీ ఎందుకు? మాటకు ముందు మా తాత నన్ను పదకొండేళ్ళ దాకా పక్కలో పడుకోబెట్టుకొని ధ్రువుడి కథ, రామాయణం కథ చెప్పేవాడు అంటావు. ఇప్పుడు మా అబ్బాయీ, నీవూ నాలుగేళ్ళకోసారి చూసుకుంటారు. వాడు చెప్పేది నీకర్థం కాదు, నీవు చెప్పేది వాడికర్థం కాదు" అన్నాడు మూర్తి.

"అయితే ఇప్పుడేమంటావు?"

"ఇకముందు ఈ ఓపిక కూడా ఉండదు. అమ్మ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే కదా! ఓసారి నాతో రాండి. నేనే దగ్గరుండి తీసుకవెళుతున్నాను కదా! మళ్ళీ ఆర్నెల్ల తర్వాత, ఉండగలిగితే ఓ ఏడాది ఉండిన తరువాత మళ్ళీ తిరిగి వచ్చేద్దురుగాని. అప్పుడెవరైనా తెలిసివాళ్ళు వస్తుంటే వాళ్ళతో వచ్చేద్దురుగానీ, లేదా మీ కోడలు మీతో వస్తుంది" అన్నాడు సాంబమూర్తి.

"నాకా మోకాళ్ళ నొప్పులు. మీ అమ్మకు నడుములు పని చేయవు. ఇప్పుడా విమానాల్లో ఎట్లానోయ్ ప్రయాణం చెయ్యడం" అన్నారు రావుగారు.

"అందుకే గదా ముఖ్యంగా మిమ్మల్ని తీసుకెళ్ళడం. మంచి డాక్టర్లున్నారు. వాళ్ళకు చూపిస్తాను. అదీకాక కొన్నాళ్ళైనా మీకు రెస్టు ఉన్నట్లుంటుంది. ఇంకా అరవై ఏళ్ళు నిండిన తర్వాత కూడా ఆమె వండిపెట్టడం నుంచి కొన్నాళ్ళు మీరు రిలీఫ్ ఇవ్వరా" అన్నాడు మూర్తి.

"అక్కడ ఎవరు వండిపెడతారురా? మీ ఆవిడకు కూడా ఉద్యోగమే కదా!"

"ఆ బాధ పెట్టుకోకు నాన్నా. మైక్రోవేవ్ ఓవెన్ మీద రెండు నిమిషాల్లో వండేయచ్చు. వారం రోజులు ఫ్రిజ్‌లో పారేస్తే మళ్ళీ అటు తొంగి చూడాల్సిన పనే లేదు. అన్నీ దొరుకుతాయి. ఆవకాయ దగ్గర్నుంచీ కొనుక్కోవచ్చు."

"ఏమోరా. ఈ వయసులో నాకు కానీ, మీ అమ్మకు కానీ ఏదైనా అప్రశస్తం జరిగితే నీవక్కడ ఒంటరివాడివి, చాలా ఇబ్బంది పడతావు. నీ దుంప తెగుతుంది."

"ఏమిటి నాన్నా అవాచ్యపు మాటలు. మీ ఇద్దరిప్పుడు బాగానే ఉన్నారు" అన్నాడు మూర్తి.

"సరే! నీకేం తెలుసు. మా తాత సంగతి చూశాను. మా నాన్న సంగతి చూశాను. మొన్నామధ్య అమెరికా వెళ్ళి మూడోరోజునే జబ్బుపడి, బెంగపడి తిరిగివచ్చి, మూడు నెలలైనా తిరగకుండానే కాలం చేసిన భగీరథరావు సంగతి చూశాను. అవునులే, ఆయన సంగతి నీకేం తెలుసు. మీ అమ్మ మేనమామ మనవడు. దశరథరామయ్య దౌహిత్రుడి రెండో బిడ్డనే కదా ఇచ్చింది?"

"అవన్నీ నాకు తెలీవు. నీవెప్పుడో ఇక్ష్వాకుల నాటి మాటలు చెబుతావు ఎప్పుడు కదిలించినా" అని కొంచెం విసుక్కున్నాడు మూర్తి.

"అవునురా. తల్లి చెవులు తెగేసినవాడికి పింతల్లి చెవులు బీర పువ్వులట. మీ అమ్మతోనే నీవు తెలుగు మాట్లాడలేవు" అని అక్కసు వెళ్ళబుచ్చారు రావుగారు.

"అవన్నీ తర్వాత సంగతులు. నాకు ఒబెరాయ్‌లో కాన్ఫరెన్స్ ఉంది. గౌతమ్ ట్రావెల్స్‌కి వెళ్ళి మీ ప్లేన్ టికెట్ బుక్ చేస్తాను" అని ఖండితంగా చెప్పాడు మూర్తి.

"జననీజన్మభూమిశ్చ" అని గొణిగారు రఘునాథరావు.

"కావలిస్తే రామాయణం అక్కడికే తెచ్చుకోగాని, స్వదేశమంటే తెలుసు. భువనత్రయమంటే ఏమిటన్నదానికి ఇంత పురాణం చెప్పావు" అని నవ్వాడు కొడుకు చనువుగా.

"అవునయ్యా! నీకేం తెలుస్తుంది. మా నాన్న సుందరకాండ పారాయణం ముప్పై ఆరుసార్లు చేశాడు. ఉద్ధవుడెవరు? శ్రీకృష్ణుడికేమవుతాడని నిన్నడిగితే ఏం లాభం" అని దెప్పారు రావుగారు.

"నే వెళుతున్నాను. అమ్మా, నేను వచ్చేసరికి నాలుగు గంటలవుతుంది. చాదస్తంగా నాకోసం అన్నం తినకుండా కూచునేవు. సాయంత్రం కంది పచ్చడి చెయ్యి" అని బ్రీఫ్ పట్టుకుని లేచాడు సాంబమూర్తి.

"భువనత్రయం అంటే మూడు భవనాలు కావురా! మూడు లోకాలు. భూలోకం, స్వర్గలోకం, పాతాళం."

"అవునా. ఇప్పుడు మేముంటున్నది స్వర్గలోకంలో. కొందరు దాన్ని పాతాళమని కూడా అంటారనుకో" అన్నాడు మూర్తి.

"పాతాళానికేమోయ్! వాళ్ళ రాజధాని పేరు భోగవతి. ఉలూచి కథ నీవు వినలేదు. అవునులే. ఆరో ఏడు నుంచీ నీదంతా ఇంగ్లీషు మీడియం కదా!"

"అందుకే పాతాళమో, దివ్య లోకమో చూద్దురుగాని" అంటూనే అపార్ట్‌మెంట్ లిఫ్టు దగ్గరకు పరిగెత్తాడు సాంబమూర్తి.

* * *

ఆ విధంగా రఘునాథరావుగారికి భార్యా సమేతంగా అమెరికా ప్రయాణం తప్పలేదు. కొడుకు దగ్గరుండి తీసుకొని వెళుతున్నాడు కాబట్టి వర్ధనమ్మకు గుండెలు కుదుట పడ్డాయి. అయినా, ఏదీ నోట్లో పెట్టుకోవాలన్నా అనుమానం. విమానంలో

అటు వక్కా, ఇటు పక్కా వాళ్ళు ఏవి టేవిటో అంటుంటే కడుపులో దేవిరింపు. వాంతి రాకుండా ఎన్నిమాట్లు ఆపుకుందో! మొత్తానికి లాస్ ఏంజిలిస్ చేరేసరికి ఆమె తోటకూర కాడలా వేలాడిపోయింది. ఆయన ముందుగా మగ్గవేసిన పచ్చికాయలా కమిలిపోయాడు. అక్కడి నుంచి మరో విమానంలో శాన్‌హోజె చేరుకున్నారు. లాస్ ఏంజిలిస్‌లో సాయంకాలం దాకా విమానం లేకపోతే కృష్ణారెడ్డి అని తన స్నేహితుడట, వాళ్ళింటికి తీసుకొని వెళ్ళాడు కొడుకు. అక్కడ భోజనం చెయ్యమంటే గొంతు కోసినా వల్ల కాదంది వర్ధనమ్మగారు. అయితే బహు మృదువుగా, మర్యాదగా చెప్పింది. ఆమె పుట్టిల్లు బ్రాహ్మణపల్లి. తాతగారు చతుర్వేదుల వారు. సాంబమూర్తి అక్కడే పుట్టాడు. అమ్మకంటే అమ్మమ్మ చాలా నయం. బతికి లేదు గాని, నిస్సంకోచంగా తనతో అమెరికా వచ్చేసేది ఆయన మీద ఇన్ని అక్షింతలు చల్లి, తమ మీద కూడా చల్లుకుంటారు అందరూ అపనమ్మకం ఏమైనా ఉంటే మన్నించమంటూ. ఏం ఆ కథ దేవుడు రాశాడా ఏమిటి? మనిషి అలాటి కథలు రాయకూడదా. రాయొచ్చు. జరుగుతాయనుకున్నవి జరగక పోవచ్చు. జరగవనుకొన్నవి జరజరా జరగవచ్చు.

మూడో రోజున రఘునాథరావు కాస్త అట్లా బయట తిరిగి వస్తారా సాంబూ అనడంతో మూర్తి కాస్త ఉలిక్కిపడ్డాడు. "నాన్నా ఇక్కడ వీధులన్నీ ఒకేలా ఉంటాయి. ఇళ్ళన్నీ ఒకేలా ఉంటాయి. నీకు ఇంగ్లీషొచ్చనుకో, నీవు మాట్లాడేది వాళ్ళకర్థం కాదు. చాలా విశాలంగా ఎంచక్కా ఉంది. ఎంత నిశ్శబ్దంగా ఉందీ అని నీవు రోడ్డుమీదకు నడిచావనుకో, వంద డాలర్లు జరిమానా వేస్తారు. ఇక్కడ రోడ్లు నడవడానికి కాదు, కార్లు నడవడానికే. నా స్నేహితుడు

అక్కడివే ఇక్కడా చేసిపెడుతున్నది పాపం. మీరు ఇంత బాగా వంట చేస్తారని తెలియదు అత్తయ్యగారూ అని మనోరమ ఉబ్బేస్తున్నది. 'నేను చెప్పలేదటోయ్. మా అమ్మ చారు కాచినా కంచడన్నం లాగించెయ్యొచ్చు' అని వంత పాడుతున్నాడు కొడుకు. శనివారం తొమ్మిది గంటలలోపే వెళితే ఇండియన్ బజార్‌లో గోంగూర కూడా దొరుకుతుంది. తొమ్మిది గంటల తర్వాత పోతే అప్పటికే ఎగరేసుకపోతారు. మళ్ళీ వారం రోజుల దాకా ఎదురు చూడాల్సిందే. గోంగూర కోసం కాదు. ఆఫీసు కోసం. పోనీ మేమిద్దరం వెళతాంరా అబ్బాయీ అంటే, చాలు చాలు అదొకటా. ముప్ఫై మైళ్ళుంది, నీకు కారు నడపటం కూడా రాదు అంటాడు కొడుకు.

ఆవిడ వాకింగ్‌కు రమ్మంటే నేను రానంటుంది. మనవడికి పప్పూ బువ్వ, పెరుగూ బువ్వ అని

# తరతరాల కథలు

అనుకున్నాడు సాంబమూర్తి. బ్రెడ్డు కూడా భయం భయంగా తిన్నాడు రఘునాథరావు. ఆ రాత్రి ఎనిమిది గంటలకు శాన్‌హోజె చేరేప్పటికి కోడలు, మనవడు ఎయిర్‌పోర్ట్ దగ్గర 'హాయ్' చెప్పేసరికి ప్రాణం లేచివచ్చింది వర్ధనమ్మగారికి. గుండెలు కుదుటపడ్డాయి రావుగారికి. కార్లో టాటా, టాటా (తాత కాబోలు!) అని మనవడేదో చెపుతుంటే అప్పుడే టాటా ఎమిటా అని మథనపడ్డారు రావుగారు. ఒక్క ముక్కా అర్థం కాలేదు రావుగారికి. దిగులో, అలసటో, భయమో, బెరుకుతనమో. ముప్ఫై ఎనిమిదేళ్ళ వైవాహిక జీవితంలో ఇల్లాలు పక్కనే ఉన్నా నిద్ర పట్టని రాత్రి అంటే ఇలా ఉంటుంది కాబోలు అనిపించింది రావుగారికి. కానీ, అలసట వల్ల ఇద్దరూ నిద్రపోయారు. నిద్ర లేచేసరికి ఉదయం తొమ్మిది దాటడం ఉలికిపాటు కలిగింది వాళ్ళకు. కొడుకు ఆఫీసుకి వెళ్ళాడుట. కోడలు మధ్యాహ్నం నుంచి వెళుతుందట.

"అత్తయ్యా రండి. ఓవెన్ మీద కాఫీ ఎలా ఆరు సెకండ్లలో దింపాలో చూపుతాను" అంది మనోరమ. ఆమె మలయాళీ. అయినా, వాళ్ళ నాన్నగారు హైదరాబాద్‌లో పాతికేళ్ళు ఉద్యోగం చేశారు కాబట్టీ, అక్కడే పుట్టింది కాబట్టీ తెలుగు వచ్చునని చెపుతుంది. ఇంకా నయం. వంటింట్లో అయ్యప్పస్వామీ, సాయిబాబా ఫోటోలున్నాయి. వర్ధనమ్మ గారు దండం పెట్టుకుంది.

* * *

సత్యనారాయణస్వామి వారి వ్రత కథలో అథ తృతీయాధ్యాయః- మూడో అధ్యాయం ప్రారంభమైనట్లు ఇక్కడి నుంచి అడుగడుగునా ఆశ్చర్యాలు, చమత్కారాలు ఎదురైనాయి రావుగారికి. ఆ కథనిప్పటికి ఎన్ని లక్షల మంది, ఎన్ని కోట్ల మంది చదివారో, ఎవరికీ అనుమానాలు రాలేదు. పైపెచ్చు

జోక్ చేస్తుంటాడులే. అమెరికాలో కాళ్ళు లేకపోయినా ఫరవాలేదు గానీ కార్లు లేకపోతే బతకలేం అని. పోనీ ఒకపని చెయ్యి. కొంత దూరం నడక దారిమీద వెళ్ళి ఎక్కడా అటూ ఇటూ పోకుండా మళ్ళీ వెనక్కు వచ్చేయ్. మన ఆస్టాన్‌ప్లేస్ ఉంది చూడూ, దానిచుట్టూ గుండ్రంగా రెండు కిలోమీటర్ల నడక దారి ఉంది. పొద్దునా, సాయంకాలం పరిగెత్తేవాళ్ళూ, జాగింగ్ చేసేవాళ్ళూ చకచక నడిచేవాళ్ళూ నీకు కనపడతారు. నీకు వాళ్ళు తెలియకపోయినా గుడ్‌మార్నింగ్‌లు, బైబైలు చెపుతుంటారు. గాబరాపడకు. ఎవరైనా మన పంచెకట్టు మనిషో, లుంగీకట్టు మానవుడో కనపడితే మాట్లాడించకు. వాళ్ళు మాట్లాడరు" అని మూర్తి చిన్నపిల్లవాడికి చెప్పినట్లు చెప్పాడు తండ్రికి.

అందరూ పెద్ద పొరపాటు పడతారు, వయసులో పెళ్ళాం అవసరమని. నిజానికి వయసు మీరిన తర్వాతనే భార్య అవసరం బయటపడుతుంది. ఒకటి మాత్రం నిశ్చయం. వర్ధని లేకుండా తాను ఎక్కడికీ వెళ్ళడు. స్వర్గానికో, నరకానికో ఎటూ తప్పదు. కూరలన్నీ

**అందరూ పెద్ద పొరపాటు పడతారు, వయసులో పెళ్ళాం అవసరమని. నిజానికి వయసు మీరిన తర్వాతనే భార్య అవసరం బయటపడుతుంది.**

రెండు మాటలు నేర్పింది., వాడెప్పుడు కేర్ నుంచి వస్తాడా, ఇంట్లో క్యార్‌మంటాడా అని ఒకటే ధ్యాస.

అసలు బ్రహ్మాండమైన ఆశ్చర్యం వారం రోజుల తర్వాత ఎదురైంది. ఈ ఆరు రోజులు ఆ వీధివైపు వెళ్ళలేదు. నరసారావుపేటలోనైతే నిమ్మతోట వీధి ఉంది. అక్కడ నిమ్మతోట లేకపోయినా ఆ పేట పేరుమాత్రం అదే ఇప్పటికీ. కాలిఫోర్నియాలో కూడా నిమ్మకాయల వీధి ఉండటమే ఆశ్చర్యకరం. ఆ వీధి చాలా ప్రశాంతంగా ఉంటుంది. నరసంచారమే ఉండదు. మరి ఇన్ని ఇళ్ళు ఉన్నాయి కదా, మనుషులుండరా? పిల్లా పాపా, ముసలీ ముతకా ఉండరా? ఎవరూ కనపడరేం? తాను మార్నింగ్ వాక్ తొమ్మిదింటికి వెళ్ళినా ఈవెనింగ్ అయిదు గంటలకే వెళతాడు కదా! కార్లలోనే వాళ్ళ కాపురం అయి ఉంటుంది. పొద్దున ఎనిమిది లోపున వెళిపోతారేమో. రాత్రి ఎనిమిది గంటలకి కార్లలో నేరుగా ఇళ్ళలోకి వెళిపోతారేమో. అన్నట్లు ముసలీ ముతకా ఉండరట. వాళ్ళ ఇళ్ళూ వాకిళ్ళూ వేరట.

ఆ వీధి పేరైతే స్టీవెన్స్ వీధి అని వీధి మొగదల బోర్డు ఉంది కానీ, రఘునాథరావు ఆ వీధికి నిమ్మకాయల వీధి అని పేరు పెట్టుకున్నాడు. అది చాలా చిన్న ఇల్లే. ఇటువంటివాటినే కాటేజస్ అంటారేమో. ఆలయంలో ద్వారపాలకుల మల్లే ఆ ఇంటికి కొంచెం ఎడంగా అటొక నిమ్మచెట్టూ, ఇటొక నిమ్మచెట్టూ. ఆ చెట్లమీద కాయలెక్కువో, ఆకులెక్కువో తెలియడం లేదు. రోజూ కింద అయిదో ఆరో రాలిపడిపోయినవి కనపడతాయి. ఆ వీధిని ఆ చెట్ల పక్కనుంచి కాలినడవలో నడుస్తున్నప్పుడల్లా ఓ పది కాయలు కోసుకుంటేనేం అని చాపల్యం కలుగుతుంది. ఇదే ఇండియాలోనైతే బట్టబయలుగా ఇన్ని నిమ్మకాయల, నిమ్మపళ్ళ చెట్టయితే బతకనిస్తారా.

ఒక్క రాత్రిలో, ఆ మాటకు వస్తే ఒక్క పగలులో ఆకతాయి మూక కోసుకొనిపోరా. భయపడుతూనే కింద రాలినవి రెండు కాయలు అటూ ఇటూ జాగ్రత్తగా చూస్తూ పాంట్ జేబులో భద్రపరచి ఒకరోజున ఇంటికి తీసుకొని వెళ్ళాడు రావుగారు. ఇవెక్కడివని అడిగింది కోడలు. భయపడుతూనే చెప్పారు మామగారు. చాలా నామర్దా అండీ! అట్లా ఎప్పుడూ చేయవద్దు. పట్టుకుంటే అప్రతిష్ఠ. జైల్లో కూడా పెడతారు. మీకెందుకు అని చిన్న పిల్లాణ్ణిలా మందలించింది మనోరమ. మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు అని పాతకాలపు పిచ్చి సామెత గుర్తుకు వచ్చింది రావుగారికి.

కానీ, ఆ వీధిలో నడుస్తుంటే గుండె గుబగుబలాడుతుంది. ఏవైనా కింద మంచి కాయలు రాలి ఉన్నాయేమోనని చూస్తాడు. పుచ్చువీ, చచ్చువీ రాలితే ఏమిటో తన పర్సు ఎవరో కొట్టేసినట్టు బాధపడతారాయన. రోజూ ఆ వీధికి అదొక ఆకర్షణ. "ఆ కాయలు అలా చెట్టు మీదే ఉంచేస్తారా? ఏం చేస్తారు" అని అడిగారాయన కోడలిని. "ఏమో ఎవరికి తెలుసు. సూపర్ బజారుకి తర్వాతెప్పుడైనా పంపించు కుంటారేమో" అని ముఖం చిట్లించబోయింది.

ప్రతి ఇంట్లోనూ ఇంచుమించు గులాబి పొదలున్నాయి. ఒక రోజు ఒక ఇంటి గుమ్మం పక్కన దడి లేకుండానే విరగ పూసిన గులాబి పొదను చూశాడు. విస్తుపోయి లెక్క పెట్టాడు పూలను. నూట ఏభై లెక్క పెట్టిన తర్వాత 'ఎన్ని ఉంటే మనకెందుకు' అని ఉసూరు మనిపించిందాయనకు. అట్లా కలకలలాడుతూ విరగబడిపోతూ అవి రాలిపోవాల్సిందే కానీ, ఎవరూ కోసుకోకూడదా! కోస్తే కొడుకూ, కోడలూ చీవాట్లు పెడతారేమో!

అది వసంతకాలమట. పూల లోకమేదో వాలెనేమో అన్నాడు వెనకటికి ఒక కవి. అట్లా వాసన లేకపోతేనేం. ఆ రంగులు, ఆ హంగులు- నీక్కూడా కవిత్వం వచ్చేస్తున్నదే అని సంబరపడి పోయి, బోల్డు విచారపడిపోయారు రావుగారు.

* * *

ఇట్లా ఓ నెల రోజులు గడిచిన తర్వాత నిమ్మకాయల వీధిలో నడుస్తుండగా జాలిపడడం తగ్గింది రావుగారికి. అలవాటైపోయింది. కానీ, ఒక కొత్త బెరుకు పట్టుకుంది. ఉదయం తొమ్మిదిన్నరకు నిమ్మ కాయల చెట్ల మధ్య లోగిలి ముందు కాలి నడవాలో తాను అడుగులు వేస్తున్న సమయానికి ఆ కాటేజి నుంచి ఎవరో తనను రోజూ వారం రోజుల నుంచి పరికించి, పరకాయించి, పరిశీలించి పరీక్షగా చూస్తున్నారు. రఘునాథరావు గారికి జంకు గొంకులు అనిపించ లేదు కానీ, సిగ్గూ, బిడియమూ కలుగుతున్నాయి. తానేమో నిమ్మ కాయల అపహర్త అయినట్లూ, పెద్దమనిషి పులుకూ పులుకూ వీడి పని పడదామని చూస్తున్నట్లూ అనిపించి ఛీ ఛీ అనుకొనేవారాయన. అయినా, పోవటం మానుకోక, ఆ రోడ్డేమీ వాడి అబ్బ సొమ్మా అని చిరాకు పుట్టుకొచ్చి, తప్పకుండా వెళ్ళాల్సిందే అని ధీమా కలుగుతున్నది. సాయంకాలమెప్పుడైనా వెళితే ఆ పెద్దమనిషి పత్తేదార్ పనిలో కన్పించేవాడు కాడు కానీ, ఉదయం మాత్రం ఆ పీడ తప్పేది కాదు.

ఇట్లా ఓ పది రోజులు గడిచిపోయిన తార్వాత ఒక రోజున అటకాయించనే అటకాయించాడు 'రావుగారిది నరసారావు పేట కదా' అంటూ ఇంగ్లీషు- తెలుగులో. రావుగారు అదిరిపడ్డారు. పట్టపగలే ఎవరో దొంగ వచ్చి పిస్టల్ చూపి, 'కాస్త బాత్‌రూమ్‌లోకి వెళ్ళి గడియ పెట్టుకుంటారా' అని అడిగినా అంత భయ భ్రాంతుడు కాకపోయేవాడేమో ఆయన. పెదవులు ఎండిపోతుండగా ముఖం వెలవెలపోతుండగా ఏం మాట్లాడకుండా ఆ వ్యక్తి కేసి పరీక్షగా చూశారు.

"చాలా ఆశ్చర్యం. నా జన్మలో మళ్ళీ మిమ్మల్ని చూస్తాననుకోలేదు. అదొక లోకం. ఇదొక లోకం. అసలు నమ్మలేకపోతున్నాను. కాస్త లోపలకు రండి" అన్నాడతడు.

రావుగారు బిక్కచచ్చిపోయినారు. ఆయనకు మాట్లాడే శక్తి లేదు. సోర్సరర్స్ అంటే మంత్రాలూ, మాయ గాళ్ళూ ఇతర దేశాల్లో కూడా ఉంటాయ(ర)ని తెలుసు. కానీ, ఇదేమిటి?

"అంకుల్. డిస్టర్బ్ కాకండి. నెమ్మదిగా చెపుతాను" అంటున్నాడతను. ఎక్కువ ఇంగ్లీషులో చెప్పు తున్నాడు. ఎప్పుడో పట్టిపట్టి ఒక తెలుగు మాట. అది కూడా తెలుగులాగా అన్పించదు.

"క్షమించాలి. మీరెవరో చెపుతారా? అప్పటి దాకా నాకు అయోమయంగా ఉంది" అన్నారు రావుగారు.

"చెపుతాగా రండి. మరేం భయంలేదు. నేను రెండు వారాలుగా మిమ్మల్ని అబ్జర్వ్ చేస్తూనే ఉన్నాను. మీకోసమే నా ఆఫీస్ వేళ కూడా మార్చుకున్నాను. రండి లోపలికి. ప్లీజ్."

రావుగారు మంత్రించినట్లు అతడి వెంట లోపలికి వెళ్ళారు. లోపల తలుపు మీద నేమ్ ప్లేట్ ఉంది. ఆర్.ఎల్. ట్రైనేట్రమ్. ఇంకా ఏవో పొడి అక్షరాలు. డిగ్రీలో, ఉద్యోగం హోదానో తెలీదు. అంత మెత్తటి సోఫాలో ఎప్పుడూ తాను కూచోలేదు. "అంకుల్! డ్రింక్, కాఫీ. ఏది కావాలి" అంటున్నాడతడు.

చప్పున రావుగారు లేచి, "మీరెవరో, ఇదంతా ఏమిటో చెపితేగానీ నాకేమీ పాలుపోవడం లేదు" అని పట్టి పట్టి కూడబలుక్కుని, పెకలించుకొని వీలైనంత స్పష్టంగా ఇంగ్లీషులోనే వేడుకున్నాడు- ప్లీజ్, ప్లీజ్ అని.

అతడు పెద్దగా నవ్వబోయి తమాయించుకున్నాడు. అతడి గొంతు పూడుకొనిపోవడం, కళ్ళలో గిర్రున నీళ్ళు తిరగడం చూసి రావుగారు అవాక్కైనారు.



అతడు నిగ్రహం మీద కళ్ళు తుడుచుకొని, "అంకుల్, నలభై ఏళ్ళలో మీలో పెద్ద మార్పేమీ లేదు. జుట్టు పలచబడింది. అదే ముక్కు. అదే నడక. అదే చేతులూపడం. అందుకే గుర్తుపట్టగలిగాను. యుద్ధ కాలంలో పాతబస్తీలో శివాలయం దగ్గర ఉండేవారు కాదా మీరు?"

"అవును. మీకు నరసరావు పేట తెలుసా?"

"నేను పుల్లయ్యగారి కొడుకు రామలింగాన్ని. ఇంట్లోంచి పారి పోయొచ్చాను."

"ఓ ఎన్నాళ్టి మాట. ముప్పై ఏళ్ళ పైనే కావస్తోంది." రావుగారు కొంచెం స్తిమితపడ్డారు. నిజమే. పూర్తిగా మరచిపోలేదు తాను. కానీ, ఎప్పుడో చదివిన కథలా ఉంది. ఆ పరిసరాలు, ఆ మనుషులు, ఆ రోజులు గుర్తు తెచ్చుకోవడం.

"ఇప్పుడు గుర్తు వస్తోంది. శిథిల మైపోతున్న పెంకుటిల్లు. రామలిం గానికిద్దరు అక్కలు. ఒక తమ్ముడు. పుల్లయ్యగారు నలభై ఏళ్ళు కూడా రాకుండానే చనిపోయారు. ఆ తర్వాత ఆయన రెండో అల్లుడు ముక్కంటి చనిపోయాడు. అవాళ ఆ వీధివాళ్ళంతా ఏడ్చారు. సాయం కాలం కానీ ఎవరూ ఇళ్ళలో పొయ్యి ముట్టించలేదు. ఆ పిల్ల అంబా భవానికి జుట్టు తీయించేశారు. ఆ పిల్ల గుడి తీసి ఉన్నంత సేపూ గుడి లోనే ఉండేది. అమ్మవారి ముందు కూచోని అట్లా చూస్తూ ఉండేది. ఆ పిల్లకు పిచ్చి పుట్టిందన్నారు. ఎవరితోనూ మాట్లాడేది కాదు. వాళ్ళమ్మ భ్రమరాంబగారు వీధిలో ఎవరు కన్పించినా శోకాలు పెట్టేది. ఎవరైనా సహాయం చెయ్యాలి. లేకపోతే పస్తు. అట్లా ఉండగా రామ లింగాన్ని మేనమామ తీసుకొని పోయాడన్నారు. అతనికప్పుడు పద్దెనిమిదో, ఇరవయ్యో ఏళ్ళుండే వేమో! రామలింగం తమ్ముడు

తలపశాయి. ఆ వీధిలోనే వారాలు చేసుకునేవాడు. స్కూల్లో ఆరో తరగతో, ఏడో తరగతో చదివేవాడు.

"మీ మేనమామ నిన్ను దాచేపల్లి తీసుకొని వెళ్ళాడు కదా. తర్వాత మేమక్కడ నుంచి చోడవరం బదిలీ పైన వెళ్ళాం. తర్వాత టెక్కలిలో నా డిగ్రీ పూర్తి అయింది. సెంట్రల్ ఎక్సైజ్‌లో నేను ఆఫీసర్‌గా రిటైరైనాను. చీరాల, గుంటూరు తర్వాత హైదరాబాద్‌లో ఇరవై ఏళ్ళున్నాను. నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదయ్యా" అంటే రావుగారికి కూడా కన్నీళ్ళ పర్యంతమైంది.

ఓ! ఇప్పుడు గుర్తుపట్టారు. మళ్ళీ నేను మావాళ్ళను చూడలేదు. యుద్ధపు రోజులలో నేను సైన్యంలో చేరిపోయాను. దాచేపల్లిలో మా మేనమామ బాగానే చూసేవాడు. కానీ, నేను ఊళ్ళో అల్లరి ఆకతాయి పిల్లాడిగా పేరుతెచ్చుకున్నాను. ఆయన భరించేవాడు. కానీ, మా అత్త భరించలేకపోయేది. సూటిపోటి మాటలు. కడుపు మాడ్చడం. వాళ్ళ పిల్లాడు కనకలింగం నాతో మాట్లాడితే చావబాదేది. కోపం ఎక్కువైతే కొట్టేది. అప్పటికే గుంటూరికి దాచేపల్లి నుంచి రైలుండేది. ఎవరో యుద్ధంలోకి కుర్రాళ్ళని తీసుకుంటున్నారు. పద్దెనిమిదేళ్ళు నిండితే చాలు, వెళ్ళి చేరవచ్చు అని చెప్పుకుంటున్నారు. ఓ రోజు మా మామయ్య నన్ను మాచర్ల పంపించాడు- అక్కడ ఎవరో తనకు పన్నెండు రూపాయలు మక్తా ఇవ్వాల్సి ఉంటే దానిని వసూలు చేసుకొని రమ్మని. నేను ఇంటి దగ్గర చంకలు కొట్టుకోలేదు కానీ, మాచర్లలో నేరుగా ఆ ఆసామి దగ్గర ఆ రూపాయలు తీసుకొని రైలు స్టేషన్‌కి వెళ్ళాను. రైలెక్కేశాను. మా మామకు తెలిసినవాళ్ళు కనపడతారేమో అని చచ్చే అదురు. కానీ, మొండితనం. ఇక నేను వాళ్ళతో ఉండలేను. నాకు చదువొచ్చే గీత లేదు. నాకు పెండ్లి కాదు. మా అమ్మను, తల చెడిన అక్కను నేను పోషించలేను. రక్షించలేను..."

"కొంచెం డ్రింక్ తీసుకోండి రావుగారూ. అది ఏమీ చెయ్యదు. ద్రాక్షరసమే..."

> **కాలి నడవాలో తాను అడుగులు వేస్తున్న సమయానికి ఆ కాటేజి నుంచి ఎవరో తనను రోజూ వారం రోజుల నుంచి పరికించి, పరీక్షగా చూస్తున్నారు.**

"ఆ కథంతా చాలా ఉందిలెండి. చిన్నతనంలో విక్రమార్కుడి కథలూ, మాయల మరాఠీల కథలూ చదివేవాళ్ళం కదా. అలా ఉంటుంది. పెషావర్, క్వెట్టా, ఇరాన్ అన్నీ తిరిగాము. ఇప్పుడు ఇరాక్ అంటున్నారు చూడండి. దాన్ని అప్పుడు మెసపటోమియా అనే వాళ్ళు. అయితే, నేను మిలటరీలో ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉండేవాణ్ణి. పది హేనేళ్ళయిపోయిం తర్వాత సిక్ అయినాను. మన తెలుగు డాక్టరే ఒకరుండేవారు. కడప వెంకటకృష్ణ అని. ఆయన నాకు సాయం చేశారు. మిలట్రీకి పనికిరానని, ఊపిరితిత్తులు చెడిపోయాయని సర్టిఫికెట్ ఇచ్చాడు. అట్లా బయటపడ్డాను. ఒక కార్ల కంపెనీలో ఉద్యోగం సంపాదించి అమెరికా చేరాను. ఫోర్డ్ కంపెనీ తర్వాత మాదే పెద్ద కంపెనీ. మెక్సికోలో కొన్నాళ్ళున్నాను. అక్కడొక ప్రేమగాథ నడిపాను. నిజానికి మెక్సికోలో మన ఇండియాలో లాగానే ఉంటారు వాళ్ళు. పూజలు, నమ్మకాలు, ఆచారాలు కూడా చాలా పాతకాలం నాటివి. నా గొడవతోనే సరిపోయింది. మీరెప్పుడొచ్చారు అమెరికా? ఇంకా ఎన్నాళ్ళుంటారు? ఇక్కడ ఎవరున్నారు మీకు? నా దగ్గర ఓ నెల రోజులుండండి. మీకు ఎంతో రుణపడి ఉంటాను. మీ అమ్మగారు మా ఇంటికి వచ్చి మా అమ్మను ఎంతో ఓదార్చేది. మా అమ్మ ఏమైపోయిందో! ఎంత ఏడ్చిందో! చచ్చిపోయే ముందు ఎంత తలచుకొందో! మా అంబ ఏమైపోయిందో. బతికుందో, లేదో! మా తలప ఏమైపోయాడో. తర్వాత ఎప్పుడైనా వాళ్ళు మీకు కనపడ్డారా?"

రావుగారు చెప్పారు: "ఇక్కడికి దగ్గరే. ఆస్టన్ ప్లేస్. ఇ ఇ-క్వార్టర్స్-372 నం. ఫ్లాట్. మా అబ్బాయి సాంబమూర్తి కంప్యూటర్ కంపెనీలో మేనేజర్. కోడలు కూడా ఇంజనీరు. ఆర్నెల్లుండొచ్చునట. తర్వాత హైదరాబాద్ వెళ్ళిపోతాం. మా అబ్బాయికింకా గ్రీన్ కార్డ్ రాలేదు. అప్పుడైతే ఎన్నాళ్ళైనా ఉండొచ్చునట. కానీ, నాకుండాలని లేదు. ఇక్కడేముంది నా బొంద? పలకరించే దిక్కు లేదు."

"అట్లా కాదు అంకుల్. నేనున్నాను కదా. మా ఇంట్లో ఓ నెల రోజులుండండి ప్లీజ్. రేపు ఆదివారం మీ ఇంటికి వచ్చి మీ అబ్బాయి కాళ్ళమీద పడతాను" అన్నాడు రామలింగం ఉద్వేగంతో.

"అన్నట్లు అదేమిటయ్యా ఆర్.ఎల్. ట్రైనేత్రమ్ అని ఉంది నేమ్‌ప్లేట్. ఆయనెవరూ?"

రామలింగం పకపక నవ్వాడు. అదొక కథ లేండి. మిలట్రీలో ఉన్నప్పుడూ, ఆ తర్వాత అమెరికాలోనూ అందరూ నన్ను 'రోమా లింగామ్' అని పిలుస్తుంటే నాకు చిరాకేసేది. ఈ చీకాకుకు చాలా బలమైన పునాది ఉంది. దాచేపల్లిలో నేను తొమ్మిది, పది తరగతులు చదివాను. నాకు బాగా గుర్తుంది. మా మామయ్య కొడుకు కనకలింగం, నేనూ ఒకే క్లాసు. కన్నేపల్లి చలమయ్య శాస్త్రిగారు మాకు మేస్టర్. ఆయనకు కుడిచేయి అవుడు. పైకి ఎత్తలేక పోయేవారు. తెలుగు మేస్టారు కదా! బోర్డు మీద రాసేది ఏముంటుంది? కానీ, నోరు బహు దురుసు. బూతులు మహా దర్జాగా మాటడేసేవారాయన. "ఒరేయ్ కనకలింగం, నీ అంత మొద్దు వెధవ ఎవరురా? వీడికి పెళ్ళాం ఎటువంటిదొస్తుందో తెలీదు. వీడిది బంగారు లింగం. తాను దూరడానికి సందు లేదు. వీడి బాబు ఈ రోమలింగంగాణ్ణి ఒకణ్ణి తెచ్చాడు. వీడికి తెలివి పూజ్యం. సున్న. హుళక్కి. ఏరా, రోమ లింగం" అని తిట్టేవాడు వట్టిపుణ్యానికి. నాకప్పుడు తెలీలేదు కానీ, తర్వాత మిలట్రీలో చేరింతర్వాత ఆడమగల రకరకాల కథలు చూసింతర్వాత, తెలిసిం తర్వాత చలమయ్య మేస్టారి తత్త్వం తెలిసింది. ఆయనకు భార్యను రోజూ కొట్టాలన్న తిక్క ఉండేది. ఆమె చాలా బాగుండేది. అందుకని ఆయనకు కోపం. మరి ఎట్లా కొడతాడు. కుడి చెయ్యి అవుడు కదా! అందుకని నాలుక గజ్జి అంతా క్లాసులో తీర్చుకునే వాడు. సరే. ఇప్పుడాయన సంగతి ఎందుకులే పాపం! మా మిలట్రీలో ఒక కల్నల్ ఉండేవాడు. 'కంబాట్'లో ఆయన రెండు చేతులూ పోయాయి. ఆ తర్వాత నేను లాహోర్‌లోఉండగా నాకు తెలిసింది- ఆయన ఏదో మిలటరీ సప్లైస్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఆయన పాత అధికారులు తరచూ ఆయన ఇంటికొస్తుండేవారు. ఈ కల్నల్ చేతులు లేకుండానే భార్యను ఎట్లా పీక పిసికాడో పిసికేశాడు.

అంకుల్! నేను కంపెనీకి వెళ్ళిపోతానిప్పుడు. రేపు ఆదివారం మీ ఫ్లాట్‌కు వస్తాను. ఆంటీ, మీరూ మా ఇంటికి తప్పక రావాలి. మీకు భోజనం ఏర్పాటు చేయలేనేమో కానీ, పండ్లూ, బ్రెడ్డూ తీసుకుందురు గాని. అన్నట్లు మీరడిగిన విషయం మరచేపోయాను. అందరూ రోమలింగం అంటుంటే చీదర పుట్టి. ఆర్.ఎల్. ట్రైనేత్రమ్ అని పేరు మార్చుకున్నాను. మీకు తెలుసుగా మా ఇంటిపేరు 'త్రినేత్రం'వారని. అదీ కథ. మెక్సికోలో నేను పనిచేస్తుండగా మా కంపెనీలోనే 'అలక్సంద్రియ' పనిచేస్తుండేది. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్. ఆవిడకు మొగుడితో పడలేదు. విడాకులిచ్చేసింది. మేం ప్రేమలో పడ్డాం. అలక సుందరి అని మురిసిపోయి దగ్గరకు తీశాను. మాకు ముగ్గురు పిల్లలు. ఈ దేశంలో ఇదంతా వేరొక లోకం. ఫాదర్స్ డేకి, మదర్స్ డేకి గ్రీటింగ్‌లు వస్తాయి. ఎప్పుడేనా చుట్టపుచూపుగా చూసుకుంటాము.

అంకుల్, నేను మీ ఇంటి దగ్గర దిగబెడతా నుండండి" అని కారు గెరేజ్‌వైపు వెళ్ళాడు ట్రైనేత్రమ్. రావుగారు బుద్ధిమంతుడిలాగా అతడి వెనకనే నడిచారు.

"ఇంత సేపు రాకపోతే హడలి చచ్చాను. పదింటి కల్లా ఇంటికి వచ్చేవారు రాకపోతే ఏమనుకోవాలి" అని ధుమధుమలాడింది. "అబ్బాయికి ఫోన్ చేయాలన్నా నాకు చేతకాదాయె" అని సాధించింది వర్ధనమ్మ.

తర్వాత ఆదివారం కొడుకూ, కొడలూ కళ్ళు విప్పార్చుకొని, బోలెడంత ఆశ్చర్యం అభినయిస్తుండగా రఘునాథరావు దంపతులు నిమ్మకాయల చెట్టు వీధికి వెళ్ళారు. మా ఆవిడ అని పరిచయం చేశాడు ట్రైనేత్రమ్. కళ్ళ భాష, పెదవుల భాష, మొగాలు మొగాలు మాట్లాడుకునే భాష ఒకటుంది మనుషుల మధ్య. వర్ధనమ్మగారు తమకు అలక్సంద్రియ ఎప్పుడో బ్రాహ్మణపల్లి నుంచీ తెలిసినంతగానే సంబరపడిపోయింది.

ఆ పండ్లూ, పేస్ట్రీలు, జ్యూస్‌లూ మొహమాటపడినా రావుగారు బాగానే లాగించారు. వర్ధనమ్మగారు మాత్రం వద్దువద్దంటూనే బిస్కెట్లు తిన్నారు. అందులో కూడా ఏమైనా ఉన్నాయేమోనని ఉలికిపాటును మాత్రం పైకి కనబడకుండా జాగ్రత్తపడ్డారు.

"రామలింగం ఒక మాట చెపుతాను, చనువుగా! ఏమీ అనుకోవద్దు. ఈవిడకు కాస్త చీర కట్టుకోవటం అలవాటు చేయించు. జట్టు కాస్త పెంచుకుంటూ ముడివేసుకోవడం నేర్పించు. మా ఆవిడ కుంకుమ బొట్టు ఎలా పెట్టుకోవాలో నేర్పుతుంది. కాస్తంత ఆ బొట్టు పెట్టుకుంటే లక్ష్మీదేవే కదోయ్. అబ్బ ఎంత కళ గల మొహం" అని సంతోషం వెలిబుచ్చారు. స్పానిష్ భాషలో ట్రైనేత్రమ్‌గారు, అలకసుందరిగారికి దాన్ని అనువదించి చెప్పిన ట్లుంది. ఆవిడ ఇల్లు ఎగిరిపోయేలా ఒకటే నవ్వు. ఆ నవ్వుకి ట్రైనేత్రమ్ మధ్య మధ్య శ్రుతి, లయ, తాళాల నోటి వాద్య సహకారం.

వాళ్ళ దగ్గర సెలవు తీసుకుంటూ రఘునాథరావు గారొక మాట చెప్పారు కారు ఎక్కబోతూ. "నాయనా రామలింగం! హైదరాబాద్ చేరిన తర్వాత నీ కోసమైనా ఒకసారి నరసరావుపేట వెళ్తాను. పాత ఊరి శివాలయానికి వెళతాను. ఆ శివుడికిట్లా చెపుతాను. 'ఓ మహాదేవా! శివార్చన ఊరికే పోదు. శివార్చకుడు త్రినేత్రం పుల్లయ్యగారు ఎన్ని కష్టాలు పడ్డా, కడగండ్లు అనుభవించినా, ఆయన పెద్ద కొడుకు ఆర్.ఎల్. ట్రైనేత్రమ్ ఇవాళ వేగాస్ మోటార్ కంపెనీలో సీనియర్ ఇంజనీర్. ముగ్గురు పిల్లలూ, ఇల్లూ వాకిలీ, అలకసుందరి అనే చల్లని ఇల్లాలూ. ఇంటి చుట్టూ గులాబీ పొదలు. ఇంట్లో కార్లూ. ఇంటిముందు విరగకాసే నిమ్మచెట్లూ.' సరేనా!"

ఆర్.ఎల్. ట్రైనేత్రమ్ అనే త్రినేత్రం రామలింగం కళ్ళలో ఇందుపగింజలంత కన్నీళ్ళు తళతళలాడాయి. అప్రయత్నంగా రావుగారు కూడా కళ్ళు తుడుచుకుంటున్నారు కర్చీఫ్‌తో. అమాయకురాలు వర్ధనమ్మ గారు, "వెళ్ళొస్తామమ్మా, వెళ్ళొస్తాం నాయనా. మీ ఇద్దరూ మా ఇంటికోసారి రాండి" అని పచ్చి తెలుగులో చెపుతున్నది. ■